A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి
APTEL 2023/16425
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 185 బుధవారం 07 ఫిబ్రవరి 2024 పేజీలు 4. వేల :4 /

కెసిఆర్‌కు కలిసి రాని యాగం..

జగన్ కు మళ్లీ అధికారం తెచ్చిపెడుతుందా..?

ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 06:
మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? యాగాలతో నేతలు అధికారంలోకి రాగలరా? ఇప్పుడు వినిపిస్తున్న ప్రశ్న ఇదే. యాగాలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది స్వరూపానందేంద్ర స్వామి.ఆయన చేతుల మీదుగా రాజశ్యామల యాగం చేసిన కెసిఆర్ రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. గత ఎన్నికల ముందు జగన్ తో ప్రత్యేక యాగం చేయించడంతో%ొా% ఆయన సైతం అధికారంలోకి రాగలిగారని ఒక ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఎన్నికల ముంగిట జగన్ తో మరోసారి రాజశ్యామల యాగం చేయించి.. అధికారంలోకి తెప్పించాలని స్వరూపానందేంద్ర స్వామి ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం.ఏటా విశాఖ శారదాపీఠంలో వార్షికోత్సవాలు ఐదు రోజులు పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. చివరి రోజు రాజశ్యామల యాగం నిర్వహించనున్నారని సమాచారం. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ఈ వార్షికోత్సవ వేడుకలకు హాజరవుతూ వచ్చారు. ఈ ఏడాది కూడా హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మ నందేంద్ర స్వామి సీఎం జగన్ కు కలిసి ఆహ్వాన పత్రం అందించారు.అయితే ఈసారి జగన్ యాగానికి హాజరవుతారా? లేదా? అన్నది చూడాలి. కెసిఆర్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తారని స్వరూపానందేంద్ర స్వామి సెలవిచ్చారు. అటు స్వరూపానందేంద్ర స్వామికి సైతం కెసిఆర్ హైదరాబాదులో ప్రత్యేక స్థానం ఇచ్చారు. కానీ స్వామి గారు చెప్పినట్టుగా కెసిఆర్ అధికారంలోకి రాలేకపోయారు. స్వామీజీ ఒకలా దీవిస్తే.. ప్రజలు మరోలా తీర్పు ఇచ్చారు. స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులతో అధికారంలోకి వస్తారు అనుకున్న కెసిఆర్ ప్రగతి భవన్ ను వీడాల్సి వచ్చింది. దీంతో స్వామీజీ

జోష్యానికి కాస్త ఇబ్బందులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రెండోసారి అధికారంలోకి రావాలనుకుంటున్న జగన్%ొా% స్వామీజీని నమ్ముతారా? నమ్మితే వార్షికోత్సవ వేడుకలకు హాజరవుతారా? మరోసారి రాజశ్యామల యాగాన్ని జరిపి.. అధికారాన్ని అందుకోగలరా? అన్నది చూడాలి.

మహానగరం పేరు చెప్పి సమర్థించుకున్న సీఎంజగన్..!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 06:
ఏపీ అసెంబ్లీలో జగన్ రెడ్డి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో ఆయన తన పాలనా తీరును ఎలా సమర్థించుకుంటారా అని అందరూ ఆసక్తిగా చూశారు.కానీ ఆయన కరోనా వల్ల నష్టపోయామని.. ప్రతీ రాష్ట్రానికి ఓ పవర్ హౌస్ లా ఉండే మహానగరం లేకపోవడం వల్ల ఇంకా నష్టపోయామని అందు వల్ల ఏమీ చేయలేకపోయామన్నట్లుగా వివరణ ఇచ్చారు. ఈ ప్రసంగం విని వైసీపీ ఎమ్మెల్యేలకు మైండ్ బ్లాంక్ అయింది. ఎక్కడైనా బల్లలు చరిచి చప్పట్లు కొడదామన్నా చాన్సివ్వకుండా.. ఐదేళ్ల తన చేతకాని తానికి కారణాలు చెప్పుకుంటూ పోయారు. ఇంకా విశేషం ఏమిటంటే మూడు రాజధానులు చేస్తానని.. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ చేస్తానని ఆయన చెప్పలేదు. ప్రతీ రాష్ట్రానికి ఓ పవర్ హౌస్ ఉండాలని.. అలాంటి పవర్ హౌస్ విశాఖ అవుతుందని ఎక్కువ సార్లు ప్రస్తావించానని చెప్పుకొచ్చారు. ఐదేళ్లలో విశాఖకు ఏంచేశారో.. మాత్రం చెప్పలేదు. ఆదాయం పెరగలేదని పదే పదే తన చేతకాని తనానికి కారణంగా చెప్పారు కానీ.. ఎందుకు పెరగలేదో మాత్రం చెప్పలేదు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాలంటారు.. కోవిడ్ అంటారు.. మరొకటి అంటారు.. అంతే తప్ప.. తాను సాధించినది ఏమిటన్నది మాత్రం

చెప్పలేకపోయారు. ఐదేళ్ల పాటు పరిపాలన చేసి.. నేను ఫలానా ఘనత సాధించానని చెప్పుకుని ఎన్నికలకు వెళ్లారు. కానీ జగన్ రెడ్డి.. గత ప్రభుత్వాన్ని.. కోవిడ్‌ను%ొా%రాష్ట్ర విభజనను చంద్రబాబును బూచిగా చూపెట్టేందుకు ప్రయత్నించారు. పైగా పొత్తులు పెట్టుకున్నారని.. ఏడుపులు కూడా ఉన్నాయి. రాజకీయంగా వేరే పార్టీల వ్యూహాల గురించి అసెంబ్లీలో జగన్ రెడ్డి చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆయన నిరాశా నిస్పృహల్లో ఉన్నట్లుగా ఉన్నారు. బహిరంగసభల్లో చెప్పే ప్రసంగాలనే అటూ ఇటూగా మళ్లీ అసెంబ్లీలో చదివి వినిపించారు.

షర్మిలకు ఉచ్చు బిగిస్తున్న బిజెపి..

తెరవెనక భారీ స్కెచ్.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి06:
నిన్న మొన్నటి వరకు సొంత కుంపటి పెట్టుకుని రాజకీయాల్లో ఏదో చేస్తానని ముందుకు వచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ తనయ.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని.. తన పార్టీ వైఎస్సార్ టీపీని కూడా ఆ పార్టీలో విలీనం చేయడం ద్వారా.. ఏపీ పగ్గాలు తీసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే.. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతున్నా నని చెబుతున్నారు. ఇది కూడా బాగానే ఉంది.

కానీ, అనూహ్యంగా షర్మిల ఎత్తుకున్న అంశాల్లో.. ప్రత్యేక హోదా ఇప్పుడు కీలకంగా మారింది. ఈ హోదా అంశాన్నిజనంలోకి బలంగా తీసుకువెళ్లి.. ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ, బీజేపీలను కూడా షర్మిల ఏకేస్తున్నారు. ఏపీకి హోదా ఇస్తామన్న హామీని నెరవేర్చలేదని, కేంద్ర మెడలు వంచుతామన్న వైసీపీ ఇప్పటి వరకు మౌనంగానే ఉందని.. షర్మిల విమర్శలు గుప్పించారు. ఇక, ఈ కథ ఇక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రదాని పీఠం ఎక్కితే గెలుపు తమదేనని చెప్పారు.

ఈ పరిణామాల్లో వైసీపీ కంటే బీజేపీకి ఎక్కువగా డ్యామేజీ అవుతోంది. పైగా.. పార్లమెంటులోనూ ఈ విషయం పై చర్చించేలా కాంగ్రెస్ నేత ఒకరు వాయిదా తీర్మానం ఇచ్చారు. మొత్తంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇటు రాష్ట్రంలోనూ.. అటు పార్లమెంటులోనూ చర్చనీయాంశం అయింది. దీంతో బీజేపీ అలెర్ట్ అయింది. షర్మిల విషయాన్ని తాజాగా బీజేపీ అగ్రనేతలు ప్రస్తావించారు. వచ్చే ఎన్నికలలో డ్యామేజీ చేసే వ్యూహాన్ని తిప్పికొట్టాలని వారు నిర్ణయించారు.

ఈ పరిణామం ఏపీ రాజకీయాలపై పడనుంది. ఇప్పటి వరకు బీజేపీ ఏపీ నేతలు ఎవరూ కూడా.. షర్మిలకు కౌంటర్లు ఇవ్వలేదు. ఆమె ఏం మాట్లాడినా..ఎవరిని తిట్టినా.. బీజేపీ నాయకులు పన్నెత్తు మాట అనలేదు. కానీ.. ఇప్పుడు నేరుగా ఢిల్లీలోని బీజేపీ పెద్దలే టార్గెట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పుడు ఏపీ బీజేపీ నాయకులు.. కూడా షర్మిలను టార్గెట్ చేయనున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆమె పార్టీ వ్యవహారాలు.. ఏపీలోకి ఎందుకు వచ్చారు ? వంటిఅంశాలను ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది.

షర్మిల టీడీపీ లేదా వైసీపీ తన అన్న జగన్‌ను టార్గెట్ చేసుకున్నంత వరకు బీజేపీ వాళ్లకు ఇబ్బంది లేదు. తమను, మోడీని టార్గెట్ చేయడం మొదలు పెడితే షర్మిలను గట్టిగా టార్గెట్ చేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నుంచి కూడా ఆదేశాలు వచ్చాయట

BJP

ఆస్తుల కోసం అన్నా చెల్లెలు పోట్లాడుకుంటే

నాకేం సంబంధం.

ఆంధ్ర ప్రగతి గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 06 : ఒకరికోసం ఒకరు అన్నట్టు పాదయాత్రలు చేసుకున్న జగన్, షర్మిల మధ్య ఆస్తి తగాదాలు వస్తే అందుకు తామెలా కారణం అవుతామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రశ్నించారు.ఈరోజు సాయంత్రం చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో నిర్వహించిన రా కదలి రా సభలో పాల్గొన్న ఆయన అన్న జగన్ పై షర్మిల విరుచుకుపడడం వెనుక తాను ఉన్నాననే విమర్శలపై ఘాటుగా జవాబు ఇచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ%ొా% నేరాలు చేసి జైలుకు వెళ్లిన జగన్ తరపున పాదయాత్ర చేయాలని షర్మిలకు తాము చెప్పలేదన్నారు. ఆరోజు పోటా పోటీగా పాదయాత్రలు చేసుకున్న వారిమధ్య ఆస్తి పంపకాలకు సంబంధించి తగాదాలు రేగాయన్నారు. అందుకే రోడ్డెక్కి షర్మిల అన్న జగన్ పై విమర్శలు చేస్తున్నారన్నారు.. ఆ విషయంలో షర్మిల తిరుగుబాటుకు తనకు సంబంధం ఉన్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు, జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకప్పుడు అదే అన్నా చెల్లెళ్ళు ఢిల్లీకి తిరిగి అక్కడి పెద్దల కాళ్ళు పట్టుకుని బెయిల్ తెచ్చుకోలేదా అని ప్రశ్నించారు. బెయిల్ కోసం కావాలంటే చనిపోయిన తన తండ్రి వైఎస్సార్ పేరు ను కేసులో పెట్టుకోమని జగన్ అన్నారని చంద్రబాబు విమర్శించారు.

ఇప్పుడు ఆస్తులకు సంబంధించి గొడవలు రావడంతో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారని అన్నారు. అధికారం చేజారిపోవడం తప్పదని తెలిసినందుననే అభ్యర్థులను ఒక చోటి నుంచి మరో చోటికి ట్రాన్స్‌ఫర్ లు చేసుకుంటున్నారని, ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదని ఎద్దేవా చేసారు. తాము అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని అంటూ అయిదేళ్లలో 20లక్షల మంది యువత కు ఇంటి నుంచే పని చేసుకునే ఉద్యోగాలు ఇప్పిస్తానన్నారు. ఇప్పటిలా ఆరోగ్యం దెబ్బతీసే జె బ్రాండ్ మద్యం కాకుండా మంచి మద్యం సరసమైన ధరలకు అందిస్తామని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను దోచుకుంటున్న పాపాల పెద్దిరెడ్డిని, దోపిడీదారులైన ఇతర ఎమ్మెల్యేలను ఇంటికి పంపిస్తామని చెప్పారు. వాలంటీర్లను తొలగిస్తామనే ప్రచారాన్ని ఖండిస్తూ ప్రజలకు సేవలు అందించే వారికి ఏమీ కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేసే వారిపై మాత్రం చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. జనసేనతో పొత్తు ఉన్నందున ప్రకటన చేయడం లేదని అంటూ నియోజకవర్గం ఇన్ ఛార్జ్ గా ఉన్న డాక్టర్ థామస్ కు మద్దతు ఇవ్వాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు బాబు విజ్ఞప్తి చేశారు.

జనసేనతో పొత్తు కొనసాగుతుంది

- ఏపీ బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి.

ఆంధ్ర ప్రగతి విజయవాడ ఫిబ్రవరి 06: ఏపీలో జనసేనతో బీజేపీ పొత్తులోనే ఉందని,ఇతర పార్టీలతో కలిసి సాగే విషయంలో నిర్ణయం పార్టీ అధిష్టానం తీసుకుంటుందని ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు.పరిస్థితులకు అనుగుణంగా పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుని పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు. జనసేనతో తమ పార్టీ పొత్తు మాత్రం కొనసాగుతుందన్నారు. పార్టీని బలోపేతం చేయడంపై తాము దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. కార్యకర్తలు కూడా ఉత్సాహంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఇటీవల 25 పార్లమెంటు నియోజక వర్గాల్లో పార్లమెంటులో కార్యాలయాలు ప్రారంభించారన్నారు. బీజేపీకి ఒంటరిగానే 360 వస్తాయని తాము విశ్వసిస్తున్నామని పురందేశ్వరి చెప్పారు.విజయవాడలో జరిగిన లీగల్ సెల్ ప్రారంభ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. రెండు నెలల్లో ఎన్నికలను ఎదుర్కోబోతున్నామని, అన్ని స్థాయిల్లో క్యాడర్ ను ఇందుకు సన్నాహం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో కార్యాలయాలు ఏర్పాటు చేశామని, ఈ ఎన్నికలలో బీజేపీకి మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.

పొత్తు మీద నిర్ణయం కేంద్రంలో పార్టీ పెద్దలు నిర్ణయిస్తారని చెప్పారు. పార్టీ ఆదేశాలు వచ్చే వరకు.. బీజేపీ బలోపేతం చెందేలా ప్రతి కార్యకర్త నిబద్ధతతో ఎన్నికల లోపని చేసే విధంగా సిద్ధపడాలన్నారు. ఏపీలో బీజేపీకి ప్రజాదరణ పెరిగిందని పార్టీలో లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపే విధంగా పార్టీ అండగా నిలుస్తామన్నారు. వచ్చే ఎన్నికలలో లీగల్ సెల్ ఏ విధంగా పని చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సర్పంచ్ లకు ఇచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని పురందేశ్వరి ఆరోపించారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం నిధులు ఇస్తే.. వాటిని కూడా సొంత ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర బీజేపీ కూడా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు. టీడీపీ, వైసీపీతో పాటు జనసేన సర్పంచ్ లు కూడా బీజేపీ ఆందోళనకు మద్దతు పలికారన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గారు కూడా ఒక కమిటీని రాష్ట్రానికి పంపారని, కేంద్రం గ్రామాల కు ఇచ్చిన నిధులు, ఉపాధి హామీ కోసం వచ్చిన నిధులను దారి మళ్లించినట్లు కమిటీ నిర్ధారించిందన్నారు. వైసీపీ పాలనలో గ్రామాలలో అభివృద్ధి అనేది కాన రాకుండా పోయిందని, అనేక మంది సర్పంచ్ లు సొంత డబ్బుతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేశారని, వారికి బిల్లులు కూడా జగన్ చెల్లించకపోవడంతో.. పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఏపీలో రోడ్ల పరిస్థితి, తాగునీటి వసతి లేక.. సర్పంచ్‌లు సీఎంను నిలదీసే పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి స్పందించక పోవడంతోనే .. సర్పంచ్ లు ఆవేదన వెలిబుచ్చేందుకు ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చారన్నారు. సర్పంచ్ లను అరెస్టులు చేయడం వైసీపీ ప్రభుత్వ నియంతృత్వాన్ని తెలియ చేస్తుందన్నారు. సర్పంచ్ ఆందోళనకు, ఆవేదనకు బీజేపీ మద్దతుగా ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీలతో పొత్తులు ఎలా ఉన్నా బీజేపీని సంస్థాగతంగా ముందుకు కృషి చేస్తామని పురందేశ్వరి చెప్పారు.

యువతకు ఏదైనా సాధ్యమే ఎన్.ఎమ్.డి ఫిరోజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: నంద్యాల జిల్లాలోని ప్రభాత్ కళశాల నందు ఛైర్మన్ డా.బి.వి.సత్య నారాయణ ఆధ్వర్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న ఓటర్లతో ముఖాముఖి నిర్వహించారు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర యువతీ యువకులకు అత్యంత ప్రతిభావంతులని పేరుందని అందుకు తగ్గట్టుగానే విభిన్న రంగాల్లో మన వాళ్లు అత్యున్నత స్థాయికి ఎదగాలంటే రాష్ట్రంలో సరైన విద్యా ఉపాధి అవకాశాలు లేక ఆంధ్ర యువత అంధకారంలోకి వెళ్ళడం దురదృష్టకరమని,వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి యువత మన రాష్ట్రంలో కంటే పక్క రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉంటున్నారని ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.అవినీతిని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా యువత ముందుంటారని,రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిదేందుకు యువత కీలకంగా వ్యవహరించాల్సిన సమయం వచ్చిందనియువగళం పాదయాత్రలో భాగంగా రాష్ట్రమంతా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్న నారా లోకేష్ సూచనలతో రాష్ట్రంలో యువత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని యువగళం పథకాన్ని టీడీపీ ప్రవేశపెట్టనుందని ఈ పథకం కింద యువత భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ 20 లక్షల మంది యువతకు ఉపాధి నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ఇప్పటికే చంద్రబాబు హామీ ఇచ్చారని కావున నంద్యాలలో ఎమ్మెల్యేగా ఫరూక్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేసుకోవాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో అనుపూరి ఈశ్వర్.అలీ. సుహైల్ రానా.అలీమ్. జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరూ అల్లరి మూకలను అరెస్టు చేసిన పోలీసులు.

ప్రత్యేక ఉప కారాగారము - నంద్యాల

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:

జిల్లా కేంద్రం పరిధిలోని సాదిక్ నగర్ కు చెందిన యస్.సాదిక్ హుస్సేన్,ఎస్.సాజిద్ ఇద్దరు ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో గాంధీ చౌక్ సెంటర్ నందు బర్త్ డే పార్టీ పేరున జంక్షన్ నందు కేక్ కట్ చేస్తూ, గట్టిగా కేకలు వేస్తూ, అల్లరి చేస్తూ, వచ్చిపోయే వాహనాలకు,ప్రజల ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, ఆడవారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉన్నందున వారిని నంద్యాల వన్ టౌన్ పోలీస్ అదుపులోకి తీసుకొని గౌరవ నంద్యాల రెండవ తరగతి మేజిస్ట్రేట్ రాంభూపాల్ రెడ్డి ముందు హాజరపరచగా రెండు రోజుల కారాగార శిక్ష విధించడం కూడా జరిగినది.కావున నంద్యాల టౌన్ లోని గాంధీ చౌక్, శ్రీనివాస్ సెంటర్, ఆత్మకూరు బస్టాండ్, ఆర్టిసి బస్ స్టాండ్ ప్రాంతాల యందు పెర్మిషన్ లేకుండా వ్యక్తిగత కార్యక్రమాల కోసం జంక్షన్ ప్రజలను గాని, వచ్చి పోయే వాహనాలను గాని అడ్డగించి ప్రజాశాంతికి భంగం కలగజేసినట్లయితే పోలీసు వారు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ బి.వెంకట చలపతి తెలియజేసారు.

రాజకీయ లబ్ధి కోసమే మా కుటుంబం పై బురద చల్లుతున్నారు.

-కబ్జాలు చేశారని అసత్య ప్రచారాలు మాను కొండి. -భీమన పల్లె కుటుంభానికి ఇవ్వడమేతెలుసు...లాక్కోడం తెలియదు.
-సేవ చేసేవారిపై అభాండాలు వేస్తే సహించము. -భూకబ్జాలు చేశామని ఎమ్మెల్యేను కు అంటగట్టడం సరికాదు.
- మాజీ కౌన్సిలర్ భీమనపల్లి వెంకటసుబ్బయ్య. -ప్రస్తుతం 6వ వార్డ్ కౌన్సిలర్ పురందర్ కుమార్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: భూకబ్జా లు చేశారంటూ అసత్య ప్రచారాలు మానుకోవాలని ,న్యాయంగా పోరాడి చట్టపరంగా హక్కులు పొందామని భీమన పల్లె పురందర,వెంకటసుబ్బయ్య లు పేర్కొన్నారు. మూల మఠం వద్ద ఆరోపణలు చేస్తున్న భుమివద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిని కబ్జా చేశారని కొందరు మా పై అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు.మా భూమిని కబ్జా చేయడానికి కొందరు కొత్త పన్నాగానికి తెరలేపారు అన్నారు.1799 సర్వే నంబర్ లో ఒక ఎకరా 64 సెంట్ల భూమి వుందని అన్నారు.ఈ భూమిలో పాండురంగ స్వామి దేవాలయం,పక్కిర్ సా,మురళి,నరసింహారావు ల భూములు వున్నాయని అన్నారు.30 ఏళ్ల నుంచి మా భూమిలో పంటలు పండించు కుంటున్నామని అన్నారు.మా పొలం చుట్టూ కంచె వేసి ,బోరు సౌకర్యం కల్పించామని అన్నారు.కొందరు వ్యక్తులు కరోనా సమయంలో ఆన్ లైన్ ఎక్కించారని తెలిసిందన్నారు.ఈ విషయంపై సంభందిత అధికారులకు పిర్యాదు చేశామన్నారు.అర్.ఓ.అర్.కేసు దాదాపు ఏడాదిన్నర పాటు జరిగిందని,అధికారులు పరిసిలించి మాకు న్యాయం జరిగిందని అన్నారు.ఇన్నాళ్లు కొలతలు ,కంచెలు పాతినప్పుడు ఎవరూ రాలేదని కబ్జా చేయాలని రెండురోజుల నుంచి మా పై ఆరోపణలు చేయడం తగదన్నారు.వారి పొలం ఇక్కడ కాదు మరోచోట వుందని తెలిసిందని అన్నారు.కబ్జా అంటే అర్థం తెలుసా ఎవరి పొలంలో నైనా కంచెలు పాతడం,దౌర్జన్యం చేయడం కబ్జా అన్నారు.మా కుటుంభం ఇవ్వడం మాత్రమే తెలుసు,లాక్కోవడం,తీసుకోవడం తెలియదన్నారు.మా తండ్రిపై అభాండాలు వేస్తే తీవ్ర పరిణామాలు వుంటాయని హెచ్చరించారు.కష్టపడి మా తండ్రి పైకి వచ్చి డబ్బు సంపాదించి చేతనైన సహాయం చేస్తారు కానీ ఒకరి సొమ్ముపై ఆశపడే నైజం కాదన్నారు.నంద్యాలలో ఎవరిని అడిగినా మా కుటుంభం గురించి చెడుగా మాట్లాడరని అన్నారు.ఎస్ డి.పి ఐ నాయకుల ఫాజిల్ మంచి మిత్రుడని ఏ విధంగా కబ్జా చేశారని చెపుతున్నారో అర్థం కావడం లేదన్నారు.అన్యాయం జరిగివుంటే కోర్టులు వున్నాయని అన్నారు.ఆ భూమి సంభందించిన రైతులు పాల్గొన్నారు.

'ఈవీఎంల స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 06: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జియం ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, పట్టణంలోని సిడబ్ల్యుసి గోడౌన్ లోని భవనాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించారు.2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్ పిదప ఈవీఎంల భద్రతా భవనాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్ కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరం అవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.అంతకుముందు నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో వున్న సి డబ్ల్యూ సి గోడౌన్ లోని భవనాలను కూడ ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూముల కొరకు కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. సబ్ డివిజన్ డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, డి.ఎస్.ఓ వెంకట్రాముడు, నంద్యాల తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యం తాసిల్దార్ ఫణి కుమార్ తదితరులు వారి వెంట ఉన్నారు.

రాజకీయం వ్యాపారం కాకూడదు...సేవ కావాలి.

- సేవ చేయడానికే క్రియాశీలక రాజకీయాల్లోకి..
- కాంగ్రెస్ నుండి నంద్యాల అసెంబ్లీ నుండి పోటీకి సిద్ధం..
- గోల్ల రాజేంద్ర ప్రసాద్



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: రాజకీయం అనేది వ్యాపారం కాకూడదు... సేవ కావాలి.. అలాంటి రాజకీయాలు ప్రస్తుతం అవసరం.. నంద్యాలలో చెత్త, చెదారం పేరుక పోతుంది... డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇంత పెద్ద పాలనా యంత్రాంగం ఉన్నా నంద్యాల పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఒక్కప్పుడు కుక్కలు, పందుల బెండద అని చెప్పుకునే వాళ్లం.. ఇప్పుడు దోమల గురించి చర్చించుకోవలసిన పరిస్థితి రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని సామాజిక సేవకుడు, కాంగ్రెస్ పార్టీనుండి నంద్యాల అసెంబ్లీ సీటు ఆశిస్తున్న గోళ్ల రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఓ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను త్వరలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేయనున్నట్లు ప్రకటించారు. 1998 నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వైసీపీ, టిడిపి పార్టీల నాయకులకు టికెట్ల పైన ఉన్న శ్రద్ధ, మమకారం పట్టణంలో ఉన్న సమస్యల పైన లేదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం నంద్యాల అసెంబ్లీ సీటు తనకు కేటాయిస్తే పోటీ చేయడానికి సిద్దంగా ఉన్నానని తెలిపారు. రాజకీయాలు అంటే వ్యాపారం కాకూడదని ప్రజలకు సేవ చేయాలన్నారు. కరోనా సమయంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విదంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవాకార్యక్రమాలు చేశానని, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, ఆత్మకూరు చెంచు గూడెలలోనూ సేవ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. త్వరలోనే పట్టణంలోని చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేయనున్నట్లు గోళ్ల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అయితేనే రాష్ట్రంలో ప్రత్యేక హెూదా ఇవ్వగలుగుతుందని, అలాగే జాతీయ కాంగ్రెస్ పార్టీ అయితేనే దేశంలో మతతత్వం, లౌకికతత్వం వెల్లి విరుస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటర్లకు అందుబాటులో ఉండాలి

- ఎన్.ఎమ్.డి ఫరూక్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:

నంద్యాల టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం నందు నిర్బహించిన క్లస్టర్.యూనిట్.బూత్ కన్వీనర్ల తో సమావేశమయ్యారు మాజీ మంత్రి టీడీపీ నంద్యాల ఇంచార్జ్ ఎన్.ఎమ్.డి ఫరూక్

ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్లు ఓటర్లకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత సత్యమో 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో అధికారంలోకి రావడం అంతే వాస్తవమన్న ధీమా వ్యక్తం చేశారు.బూత్ కన్వీనర్లు కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితాలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఓటు గుర్తించి ఓటర్లకు ప్రతి క్షణం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఈ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల ఓట్లు ఎప్పటికప్పుడు చెక్ చేస్తుండాలని బూతుల వారీగా ఓటర్లను గుర్తించి “బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ” ద్వారా అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలు ఓటర్లకు వివరించాల్సిన భాద్యత బూత్ కన్వీనర్ల వారికి దిశ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు. కౌన్సిలర్ జైనాబ్ బీ.మాజీ కౌన్సిలర్లు కృపాకర్.శివశంకర్. కరిముల్లా.జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్. ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు క్లస్టర్. యూనిట్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

గడివేములలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు.

ఆంధ్ర ప్రగతి గడివేముల ఫిబ్రవరి 06: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన గడివేములలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు ఆమంచి వేంకటేశ్వర్లుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త మండలిచే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మహేశ్వర రెడ్డి, అర్చకులు చెన్నకేశవయ్య, ప్రధానాచార్యులు యం. రామేశ్వర రావు, కృష్ణమూర్తి, డీలర్ శ్రీనివాసులు, భజన మండలి అధ్యక్షులు బాల వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి, బోడెమ్మనూరు సుబ్బారెడ్డి, భజన మండలి సభ్యులు ఈడిగ అచ్చెన్న, సుబ్బమ్మ, వీరమ్మ, దేశం సంజీవరెడ్డి, దాసరి ఎల్లయ్య, బాల సంజీవరెడ్డి, వెంకటసాయి , ఈ పూరి లక్ష్మీనారాయణ ,ఎన్ . వెంకటేశ్వర్లుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనసేన కోసం మెగా సైన్యం కార్యక్రమం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:

నంద్యాలలో ఈనెల 10న జనసేన కోసం మోగా సైన్యం పేరుతో కార్యక్రమం జరగనున్నది.కార్యక్రమ పోస్టర్లను జనసేన కన్వీనర్ విశ్వనాథ్, పిడతల సుధాకర్ పవన్ కళ్యాణ్,చిరంజీవి,రామ్ చరణ్ అభిమానులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలభారత చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు స్వామి నాయుడు, సిని నటులు పృథ్వీరాజ్,డ్యాన్స్ మాస్టర్ జాని మాస్టర్ సభకు హాజరవుతున్నారని తెలియజేశారు. స్థానిక పట్టణంలోని శోభ హెూటల్ దగ్గర నుంచి మూలమఠం వరకు ర్యాలీ ఉంటుందని అన్నారు. టిడిపి,జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామని,సమావేశంకు అభిమానులు, నాయకులు భారీగా హాజరై విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్బతి రవి , సందీప్ ,సురేష్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ వద్దని ఉయ్యాలవాడ గ్రామ సభ ఏకగ్రీవంగ తీర్మానం.

-గ్రామ సభకు తరలివచ్చిన జనం. -ఒకే మాట మీద నిలబడి తమ భూములు కాపాడుకున్న ఉయ్యాలవాడ గ్రామ రైతులు గ్రామ ప్రజలు.

-రైతులకు మద్దతుగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ భూ నిర్వాసితుల నాయకులు బి నాగన్న పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు ఫిబ్రవరి 06:

ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో గ్రామసభ గ్రామ సర్పంచ్ శకుంతలమ్మ అధ్యక్షతన జరిగింది ఈ సభకు గ్రామపంచాయతీ కార్యదర్శి సుమలత మరియు విఆర్ఓ మధుసూదన్ లు పాల్గొన్నారు. గ్రామసభను గ్రామపంచాయతీ కార్యదర్శి సుమలత ప్రారంభించగానే రైతులు గ్రామసభలో పెద్ద పెట్టున్న నినాదాలు చేశారు. సోలార్ ప్లాంట్ మాకు వద్దు ,మాకు వద్దు ,మా పొలాలను కాపాడండి మా పశువులను గొర్రెలను కాపాడండి, రైతులకు నష్టం కలిగజేసే సోలార్ ప్యాంటు మాకు వద్దు మాకు వద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసనను తెలియజేశారు వెంటనే గ్రామ పంచాయితీ కార్యదర్శి సుమలత స్పందిస్తూ సోలార్ పవర్ ప్లాంట్ ను వ్యతిరేకిస్తూ రైతులు చేసిన విజ్ఞప్తికి స్పందించి ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ అవసరం లేదని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అజెండా చదివి వినిపించి సుమారు 400 మంది రైతులు గ్రామ ప్రజలతో సంతకాలను చేయించారు. గ్రామసభలో పంచాయతీ సర్పంచ్ శకుంతలమ్మ మరియు ఎంపీటీసీ తదితరులు అందరూ సంతకాలు చేసి సోలార్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తమ ఆమోదాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ..ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడుతామని క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెంది ఇప్పటికే వివిధ రూపాలలో ఆందోళన చేసినట్లు కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారని తెలిపారు. ఉయ్యాలవాడ భూములలో వందలాది మంది రైతులు మామిడి తోటలు పూల తోటలు వివిధ రకాల పంటలు వేసుకుంటూ జీవనం పొందుతున్నారని అదేవిధంగా మామిడికి పేరెన్నిక గల ప్రాంతమని రామకృష్ణ తెలిపారు రైతుల భూములలో అన్నింటికీ బోరు బావులు ఉన్నాయని మంచి పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే డి ఆర్ డి ఓ (రక్షణ పరిశోధన కేంద్రం)పేరుతో ఆ గ్రామంలో ప్రభుత్వ ప్రైవేటు భూములు పోవడం వలన పశువులకు మేత లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, మళ్లీ ఇప్పుడు సోలార్ ప్లాంట్ తో ఉన్న భూములు తీసుకుంటే అక్కడ పశువులకు, గొర్లకు మేత లేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. దీనివల్ల ఊరంతా ఖాళీ చేసి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కాబట్టి రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్నటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పునరా ఆలోచన చేసి క్యాబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకొని సోలార్ ప్లాంటును రద్దుచేసి రైతుల పొలాలను మరియు పశువులు గొర్ల కాపర్ల జీవనాన్ని దెబ్బతీయవద్దని పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలను ప్రభుత్వాలు చేసినప్పుడు రైతులు ప్రజలు రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ ఐక్యమై తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు .అనంతరం గ్రామ సభ తీర్మానంలో 400 మంది రైతులకు పైగా సంతకాలు పెట్టారు. గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పంచాయితీ కార్యదర్శి సుమలత ప్రకటించారు. గ్రామ రైతులు రామకృష్ణ సుబ్బరాయుడు హుస్సే న్ మహబూబ్ బాషా వెంకటరమణ తిరుపతయ్య శ్రీరాములు వేణుగోపాల్ బ్రహ్మచారి సుబ్బులసమ్మ సరస్వతి మధు శకుని బి శ్రీనివాసులు మరియు రైతు సంఘం నాయకులు మధుసూదన్ మాసం భాష, మరియు వందలాది మంది రైతులు పాల్గొన్నారు

నంద్యాల ప్రజలను దోమల నుండి రక్షించడానికి వచ్చిన ఒక్కమగాడు గోకుల్ కృష్ణారెడ్డి.

-దోమల నివారణకు గోకుల్ కృష్ణా రెడ్డి ఔదార్యం. -తనసొంత నిధులతో 10 పాగింగ్ మిషన్లు,10 పిచికారి మిషన్లుఏర్పాటు.

-లాంఛనంగా ప్రారంభించిన జడ్పీటిసి గోకుల్ కృష్ణారెడ్డి. -ఫాగింగ్ మిషన్లు ఏర్పాటు చేయడంతో సంతోషిస్తున్నాను నంద్యాల ప్రజలు.

పారిశుధ్యమే.. నంద్యాలే లక్ష్యంగా...
నంద్యాల పట్టణ
పారిశుధ్యము మరియు
దోమల నివారణ పై
కృషి!
గోపవరం గోకుల్ క్రి

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: నంద్యాల పట్టణంలో దోమల నివారణకు జెడ్.పి. టిసి. గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి ఔదార్యం చూపారు. తన సొంత నిధులతో 10 ఫాగింగ్ మిషన్లు,10 పిచికారి మిషన్లు తెప్పించారు.నంద్యాల పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చేతులు ఎత్తారు.కౌన్సిల్ లో కౌన్సిల్ సభ్యులు దోమల నివారణ చేపట్టాలని ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది.ఇటీవల కాలంలో వైసిపి లో గోకుల్ రెడ్డి,శిల్పా రవి మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది.ఈ నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గం లోని ప్రజలు దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నంద్యాల జడ్పీటిసి గోపవరం గోకుల కృష్ణారెడ్డిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల నియోజకవర్గంలో ప్రతి కుటుంబంలో మహిళలు పిల్లలు పెద్దలు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసి దోమల నివారణకు తన వంతు కృషిచేస్తానని మాట ఇచ్చారు జడ్పీటిసి గోకుల్ కృష్ణారెడ్డి.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దోమల నివారణకు తన సొంత నిధులతో యంత్రాలను తెప్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఫాగింగ్ మిషన్లు వార్డుల్లో లాంఛనంగా పంపించారు.ఈ సందర్భంగా నంద్యాల మండలం జడ్పీటిసి గోపవరం గోకుల్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల మున్సిపాలిటీ 100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగినది అయినప్పటికీ దోమలు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ కౌన్సిల్ ద్వారా కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు తెలిపినప్పటికీ దోమల నివారణకు అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, దోమల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడంతో,దోమల నుంచి ప్రజలను కాపాడేందుకు 10 పాగింగ్ యంత్రాలు,10 పిచికారి యంత్రాలు సొంత నిధులతో ఏర్పాటు చేశానన్నారు. ఈ రోజు కొన్ని ఫాగింగ్ యంత్రాలను వార్డుల్లోకి వెళుతున్నాయి అన్నారు.అంచెలంచెలుగా నంద్యాల పట్టణం లోని 42 వార్డుల తో పాటు నంద్యాల మండలం, మరియు గోస్పాడు మండలాల్లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు పంపించి కృషి చేస్తానన్నారు.ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తానేప్పుడూ ముందు వరుసలో ఉంటానన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మరియు అధికారులు చేయలేని పని ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి దోమల బెడద నుండి ప్రజలను కాపాటానికి కృషి చేస్తున్న నంద్యాల మండలం జడ్పీటిసి గోపవరం గోపికృష్ణారెడ్డిని ప్రజలు అభినందిస్తున్నారు.

యువతలో రాజకీయ మేధస్సు అద్భుతం.

-పార్టీ పెద్దలు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలి.

-గుడ్ మార్నింగ్ యూత్ లో ఆసక్తి విషయాలు.

ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:

యువతలో రాజకీయ మేధస్సు అద్భుతం ఉందని నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు.నంద్యాల పట్టణంలో గుడ్ మార్నింగ్ యూత్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఉదయాన్నే ఆయన యువత ఉండే ప్రాంతాల్లో పర్యటించారు.వాకింగ్,క్రీడలు,జిమ్ తదితర ప్రాంతాల్లో యువతతో ముచ్చట్లు పెట్టారు.యువత హాయ్ అన్నా మీరేనా అభిరుచి మదు అంటూ పరిచయం చేసుకొని కాసేపు సరదాగా మాట్లాడుకుంటూ రాజకీయం వైపు దృష్టి మళ్లించారు.రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ,ప్రపంచ రాజకీయాలు మాటల్లో చెప్పుకొచ్చారు.యువత రాజకీయ మేధస్సు అబ్బురపరచింది.యువత మాటల్లో రాజకీయ నాయకులు పదవుల కోసం ఉచిత పథకాలు పెట్టీ పేద ప్రజలను ఆకర్షిస్తూ పదవులు పొందుతున్నారని అన్నారు.దేశ వ్యాప్తంగా యువత మంచి,మంచి చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పెద్దలు యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా చూడాలని కోరారు.ఉచితాలకంటే ఫ్యాక్టరీలు నెలకొల్పితే సొంత కాళ్ళ మీద నిలబడి కుటుంబాలను పోషిస్తారని అన్నారు.నాయకులు భావితరాలను దృష్టిలో పెట్టుకొని బంగారు ఆలోచనలు చేయాలన్నారు.అనంతరం అభిరుచి మదు మాట్లాడుతూ యువతలో రాజకీయంగా ఇంత మేధస్సు ఉందని ఊహకు కూడా అందలేదని అన్నారు.యువత నోటు తో కాకుండా ఓటుతో నాయకుల కళ్ళు తెరిపించాలని అన్నారు.పరిశ్రమలు స్థాపిస్తే యువతతో పాటు అన్ని వర్గాలు సంతోషంగా వుంటాయని అన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ విజేతగా నంద్యాల కు చెందిన ముకుంద.

DILIGENT
HONDA
B FIT
yayam
HENDRA

ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి06:

నంద్యాల పట్టణానికి చెందిన ముకుంద అనే వ్యక్తి ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ విజేతగా గెలుపొందారు. ఫిబ్రవరి 4వ తేదిన ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ అద్వర్యం లో రాజమండ్రి లో జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. అందులో నంద్యాల జిల్లాకు చెందినటువంటి బి. ముకుంద 75 కిలో ల విభాగంలో మొదటి స్థానం సాదించి మరియు మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ ఓవరాల్ విజేత గా నిలిచాడు. నంద్యాల పట్టణం పార్క్ నగర్ లో ఉన్న న్యూ బాడీలైన్ జిమ్ హెల్త్ %ఒ% ఫిట్‌నెస్ క్లబ్ నందు కోచ్ ఖ్వాజా మొహిద్దీన్ దగ్గర శిక్షణ తీసుకుంటు, ఈ ఘనత సాధించడం జరిగింది ..ఈ సందర్భముగా కోచ్ క్వాజా మొహిద్దిన్ ముకుందను అభినందించడం జరిగింది.

బిహార్‌లో కూటమిగా పోటీ..

-టీఎంసీ మిత్ర పక్షమే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్‌లో కూటమి, సీఎం మమతా బెనర్జీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎ?న్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాల ఇండియా కూటమి బీజేపీపై పోరాడుతుందని తెలిపారు.బిహార్‌లో ఇండియా కూటమిలో భాగంగా బీజేపీపై పోటీ చేస్తామని అన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇండియా కూటమిలో కీలకమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు తెలిపారు.భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మంగళవారం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు గమనిస్తే.. ఆమె ఇండియా కుటమిలో కీలకమైన భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు తెలుస్తుందని తెలిపారు. మమతా బెనర్జీ ఇండియా కూటమికి కీలకమైన మిత్రపక్షమని తెలిపారు. ఇండియా కూటమి నుంచి నితీష్ కుమార్ వైదొలిగినప్పటికీ తాము బిహార్‌లో మిగిలిన పార్టీలతో ఇండియా కూటమిలో భాగంగానే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ దిగుతామని వెల్లడించారు. తమ భాగస్వామ్య పార్టీలు ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగం కాదంటే.. తాను ఎప్పటికీ అంగీకరించలేనని రాహుల్ తెలిపారు.పశ్చిమ బెంగాల్‌లో బీజేపీని ఒంటరిగా ఎదుర్కొంటామని.. లోక్‌సభ ఎన్నికల తర్వాత పొత్తులు పెట్టుకుంటామని మమతా బెనర్జీ చెప్పటమే రాహుల్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది. బెంగాల్ మమతా కాంగ్రెస్‌కు ఐదు లోక్ సభ స్థానాలు కేటాయించడానికి సిద్ధపడినా సీపీఎంతో పొత్తు కారణం ఇది సాధ్యం పడదని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి నితీష్ కుమార్ వైదొలిగిప్పటికీ.. ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆర్జేడీ, లెఫ్ట్ పార్టీల భాగస్వామ్యంతో బలంగానే ఉంది. 40 లోక్‌సభ

भारत जोड़ो न्याय यात्रा
भारत जोड़ो न्याय
का
मिल
तक

స్థానాలు ఉన్న బిహార్‌లో ఇండియా కూటమి సాధ్యమైనన్ని సీట్లు గెలవడానికి కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది.

మెగా జోడీగా మీనాక్షి చౌదరి?

లక్షలాది మంది నిత్యం ను సందర్శిస్తారు. మరి మీరు మీనాక్షి చౌదరి కెరియర్ ను పరిశీలిస్తే, ఆమె గ్రాఫ్ పెరుగుతున్నట్టుగా కనిపిస్తోంది. 'హిట్' .. 'ఖిలాడీ' సినిమాల తరువాత ఆమె 'గుంటూరు కారం' సినిమాలో మెరిసింది. ఈ సినిమాలో ఆమె మహేశ్ బాబు మరదలి పాత్రలో కనిపించింది. ఆ పాత్రకి పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా ఆమె చాలా అందంగా కనిపించింది. గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసింది. ఆ గ్లామర్ కారణంగానే ఆమె ఇప్పుడు చిరంజీవి సినిమాలో ఛాన్స్ కొట్టేసిందని అంటున్నారు. చిరంజీవి కథానాయకుడిగా శ్రీవశిష్ఠ 'విశ్వంభర' సినిమాను రూపొందిస్తున్నాడు. యూవీ క్రియేషన్స్ వారు ఈ సినిమాను 150 కోట్ల బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ జోనర్ ను టచ్ చేస్తూ ఈ కథ ముందుకు వెళుతుంది. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్ ఉండనున్నట్టుగా సమాచారం. ఆ ముగ్గురు కథానాయికలలో ప్రధానమైన నాయికగా త్రిషను ఎంపిక చేశారు. ఈ రోజునే ఆమె ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలోనే మరో కథానాయికగా మీనాక్షి చౌదరినీ తీసుకున్నారనీ .. దేవకన్యగా ఆమె కనిపించనుందని అంటున్నారు. ఇందులో వాస్తవమెంతన్నది చూడాలి. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.

సీనియర్ భామలను కలవర పెడుతున్న త్రిష!

అందంగా ఉండటం వేరు ... అందాల కథానాయిక అనిపించుకోవడం వేరు. అందంగా ఉన్నవాళ్లంతా కథానాయికలుగా ఏలేస్తారనే గ్యారంటీ లేదు. ఇండస్ట్రీలో హీరోయిన్ గా నిలదొక్కుకోవాలంటే అందంతో పాటు అభినయం .. అందుకు అవసరమైన అదృష్టం ఉండాల్సిందే. ఎంత గ్లామరస్ గా కనిపించినా హీరోయిన్ గా తెరపై కనిపించేది కొంతకాలమే అనేది అందరికీ తెలిసిందే. అయితే కెరియర్ మొదలెట్టి పాతికేళ్లు అవుతున్నా స్టార్ డమ్ తగ్గకపోవడం త్రిష లాంటి కొంతమంది విషయంలోనే జరుగుతుంది. త్రిష తెలుగు .. తమిళ భాషల్లో ఏక కాలంలో స్టార్ డమ్ తెచ్చుకుంది. అక్కడా .. ఇక్కడా కూడా స్టార్ హీరోలతో కలిసి తెరపై సందడి చేసింది. భారీ విజయాలను తన ఖాతాలో వేసుకుంది. ఆ తరువాత అవకాశాలు తగ్గడంతో తమిళంలో ఆమె నాయిక ప్రధానమైన పాత్రలను చేస్తూ వెళ్లడం మొదలుపెట్టింది. '96' .. 'రాంగి' .. 'ది రోడ్ వంటి సినిమాలు అలా వచ్చినవే. లేడీ ఓరియెంటెడ్ కథలను చేతులో పట్టుకున్న మేకర్స్ కి ఆమె నయనతార తరువాత ఛాయిస్ గా మారింది. అలాంటి త్రిషకి 'పొన్నియిన్ సెల్వన్' సినిమాలో ఛాన్స్ వచ్చింది. అటు ఆ సినిమాలోను .. ఆ సినిమా వేడుకలలోను త్రిష గ్లామర్ చూసి షాక్ కానివారంటూ లేరు. తెరపై ఆమె ముత్యంలా మెరిసింది .. ముద్దబంతిలా విరిసింది. అప్పటి నుంచి అంతా ఆమె గ్లామర్ గురించి మాట్లాడుకోవడం మొదలెట్టారు. వివిధ భాషలలోని సీనియర్ స్టార్స్ సినిమాల నుంచి ఆమెను సంప్రదించడం మొదలైంది. ప్రస్తుతం ఆమె తమిళ .. మలయాళ సినిమాలతో బిజీగా ఉంది.

ముగిసిన 'తండేల్' విలేజ్ షెడ్యూల్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న లవ్ ఓరియెంటెడ్ మూవీ తండేల్. గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అర్జున్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా విలేజ్ షెడ్యూల్ ముగిసింది. ఈ షెడ్యూల్ లో ఓ అందమైన మత్స్యకార గ్రామంలో, పోర్టులో ప్రధాన తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి సహా కీలక పాత్రధారులందరూ ఈ షెడ్యూల్ లో పాల్గొన్నారు. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. తండేల్ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు.

అమెజాన్ ప్రైమ్ కి ఇంట్రెస్టింగ్ క్రైమ్ సిరీస్ .. 'పోచర్'

అమెజాన్ ప్రైమ్ ఫ్లాట్ ఫామ్ పైకి రావడానికి 'పోచర్' సిరీస్ రెడీ అవుతోంది. ఎమీ అవార్డు విజేత రిచీ మెహతా ఈ సిరీస్ ను రూపొందించారు. మలయాళంలో 8 ఎపిసోడ్స్ గా ఈ సిరీస్ ను నిర్మించారు. నిమిషా సజయన్ .. రోషన్ మాథ్యూ .. దివ్యేంద్ర భట్టాచార్య ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వారు దక్కించుకున్నారు.

ఈ సిరీస్ ను ఈ నెల 23వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సిరీస్ ను రూపొందించారు. అడవులను అడ్డాగా చేసుకుని కొంతమంది తమ అక్రమ వ్యాపారాలను కొనసాగిస్తూనే ఉన్నారు. అలా వాళ్లు చేసే వ్యాపారాలలో ఒకటి .. ఏనుగు దంతాల రవాణా. ఆ దంతాల కోసం ఏనుగులను హతమారుస్తున్నారు. అడవులే కేంద్రంగా జరుగుతున్న ఈ అక్రమవ్యాపారంపై జరిగే ఇన్వెస్టిగేషన్ ఈ సిరీస్. క్యూసీ సంస్థవారు నిర్మించిన ఈ సిరీస్, ఢిల్లీ .. కేరళ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంది. 'ఢిల్లీ క్రైమ్' సిరీస్ తో ఆకట్టుకున్న రిచీ మెహతా నుంచి వస్తున్న సిరీస్ కావడంతో అంతా కూడా ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ సిరీస్ ఎన్ని మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి

AMAZON ORIGINAL
POACHER
മലയാളം | हिंदी | தமிழ் | తెలుగు | ಕನ್ನಡ
amazon prime
FEB 23
New Series

నాని తరువాత ప్లేస్‌లో వినిపిస్తున్న సుహాస్ పేరు!

సినిమా అంటేనే కోట్ల రూపాయల బిజినెస్. మిగతా ఏ బిజినెస్ చేసినా నష్టపోతే ఆ బిజినెస్ కి సంబంధించిన ఏదో ఒక పదార్థం కళ్లముందు కనిపిస్తుంది. కానీ సినిమా విషయంలో అలా కాదు .. నష్టపోతే ఇక్కడ ఏదీ కనిపించదు .. ఎవరికీ ఆ నష్టపోయినవారు కనిపించరు. అందువలన ఇక్కడ ఎవరూ ఎవరినీ నమ్మేసి కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టరు. అలాంటి నిర్మాతల నమ్మకాన్ని సంపాదించుకోవడానికి కావలసింది టాలెంట్ మాత్రమే. అయితే ఆ టాలెంట్ ను నిరూపించుకునేందుకైనా ఎవరో ఒకరు ఛాన్స్ ఇవ్వాల్సిందే. అలాంటి అవకాశాన్ని అందుకోవాలంటే మాత్రం అందుకు అదృష్టమే కలిసి రావాలి. అలా టాలెంట్ తో పాటు లక్ ఉన్న హీరోగా ఇప్పుడు సుహాస్ కనిపిస్తున్నాడు. చాలా చిన్న పాత్రలతో తన ప్రయాణాన్ని ప్రారంభించిన సుహాస్, ఇప్పుడు హీరోగా నిలదొక్కుకున్నాడు. విభిన్నమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటూ హ్యాట్రిక్ హిట్ ను అందుకున్నాడు.రీసెంటుగా విడుదలైన 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' సినిమా రికార్డుస్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. హీరోగా ఈ సినిమా ఆయనను మరో పై మెట్టు ఎక్కించింది. ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చిన సుహాస్ అంచలంచెలుగా ఎదుగుతున్న తీరు చూస్తుంటే, నానీనే గుర్తుకు వస్తున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి ఎదుగుతున్న సుహాస్ పేరు, ఇప్పుడు నాని తరువాత స్థానంలో వినిపిస్తూ ఉండటం విశేషం